## క్లుప్తంగా

### 15న ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

రంగంపేట: కోటపాడు గ్రామ దేవత ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఈ నెల 15వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉదయం 10.29 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ చేస్తామన్నారు. అనంతరం గ్రామస్తుల సహకారంతో భారీ అన్న సంతర్పణ జరుగుతుందని చెప్పారు.

### 11న వేంకటేశ్వరస్వామి తీర్థం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో మెయిన్‌రోడ్డు పక్కన కొలువై ఉన్న పద్మావతి అలివేలు మంగాదేవీ సమేత వేంకటేశ్వర స్వామి వార్షిక తీర్థ మహోత్సవం ఈనెల 11వ తేదీ శనివారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు కల్యాణం నిర్వహిస్తామన్నారు.

### బూరుగుపూడిలో శిలువ మార్గం



కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవులు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో బుధవారం శిలువ మార్గం నిర్వహించారు. ఏసుక్రీస్తు శ్రమలను అనుభవించి, శిలువపై మరణించిన శ్రమకాలాన్ని పురస్కరించుకొని ఈ 45 రోజుల్లో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. దానిలో భాగంగా రెవరెండ్ ఫాదర్ మనోజ్ కుమార్ నిర్వహణలో 14 స్థలాల శిలువ మార్గాన్ని నిర్వహించారు. చర్చి నుంచి ప్రారంభమై అంబేడ్కర్ వీధి, బాబూ జగ్జీవన్‌రామ్ వీధి మీదుగా అల్లూరి సీతారామరాజు కాలనీ వరకూ జరిగింది. కార్యక్రమంలో దూడపల్లి సుబ్బారావు, కాతేటి జార్జి, గెడ్డం రత్నం, చుక్కా శ్యామల, కాతేటి ఇందిర పాల్గొన్నారు.

### బాలుడి వైద్యానికి పేదల సంఘం చేయూత



బాలుడి కుటుంబ సభ్యులకు సహాయం అందజేస్తున్న సంఘ సభ్యులు

గోకవరం: గోకవరంలో అరుదైన సీజీడీ వ్యాధితో బాధపడుతున్న రెండున్నరేళ్ల బాలుడు సత్యశ్రీఅక్షయ్‌రామ్ వైద్యానికి పేదల సంఘం ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వరసాల ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రమాసత్యన్నారాయణస్వామి ఆలయంలో బాలుడి కుటుంబ సభ్యులకు రూ. 35 వేలు అందజేశారు. అంతకు ముందు బాలుడి ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు, సంఘం సభ్యులు కర్రి సూరారెడ్డి, కంచర్ల సూర్యప్రకాష్, కొలిపాకుల ప్రకాష్, బొర్రా రాజేష్, మేడిపూడి హరీష్, మందపాటి సతీష్ పాల్గొన్నారు.

### ఆనందోత్సాహాలతో హోలీ



అనపర్తిలో ఆనందోత్సాహాలతో హోలీ జరుపుకుంటున్న చిన్నారులు

అనపర్తి: రంగుల పండగ హోలీని బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు ఆనందోత్సాహాల నడుమ వేడుకగా జరుపుకున్నారు. కుల మతాలకు అతీతంగా, చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువత రోజంతా హోలీ వేడుకల్లో మునిగితేలారు.

బిక్కవోలు: వసంత పౌర్ణమి పురస్కరించుకొని మండలంలోని పందలపాక, కొమరిపాలెం, కొంకుదురు, ఊల్లపల్లి, బలభద్రపురం, బిక్కవోలు తదితర గ్రామాల్లో చిన్నా పెద్ద తేడా లేకుండా హోలీ సంబరాలు జరుపుకున్నారు. బుధవారం ఉదయం నుంచి యువత బైక్‌ల మీద తిరుగుతూ రంగులు చల్లుకుని వేడుకలు చేసుకున్నారు.

### రాగి వైరు చోరీపై కేసు

బిక్కవోలు: మండలంలోని కానేడులో రాగి వైరు చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బలభద్రపురం పంచాయతీ పరిధిలోని కానేడు గ్రామానికి చెందిన ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డికి గ్లూకోజ్ ఫ్యాక్టరీ పక్కన వ్యవసాయ భూముంది. గత నెల 16వ తేదీ రాత్రి సమయంలో తన భూమిలో ఉన్న బోరుకి చెందిన రాగి కేబుల్ వైరు, ఫ్యూజ్ గ్యారేజ్‌లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లుగా ఆయన ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్‌ఐ తెలిపారు.

# సాగునీటి చెరువులకు మహర్దశ

- నియోజకవర్గంలో 53 చెరువుల అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్
- ఎమ్మెల్యే జక్కంపూడి కృషితో రూ. 38.29 కోట్ల మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



సీతారామపురంలో అభివృద్ధి పనులు జరగాల్సిన చెరువు

రాజానగరం: సాగునీటి సదుపాయాలు అంతంత మాత్రంగా ఉన్న రాజానగరం నియోజకవర్గంలో సేద్యపు నీటి చెరువులను అభివృద్ధి చేసి, రైతుల సాగునీటి సమస్యను నివారించాలనే సంకల్పంతో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేసిన కృషి ఫలించింది. చాగల్నాడు, పుష్కర వంటి ఎత్తిపోతల పథకాలు ఉన్నాగానీ, ఈ ప్రాంతంలో అధిక శాతం రైతులు వర్షాలు, చెరువులపైనే ఆధారపడి సాగు చేస్తుంటారు. ఈ కారణంగా సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లో గుర్తించిన 53 చెరువులను త్వరితగతిన అభివృద్ధి చేసేలా ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి.

**సన్న, చిన్నకారు రైతులకు అండగా..**

భూగర్భ జలాలే ఆధారంగా సేద్యం చేస్తున్న మెట్ట ప్రాంతంలో సన్న, చిన్నకారు రైతాంగానికి సేద్యపు నీటి చెరువులు కొండంత అండగా నిలుస్తాయి. బడా రైతుల మాదిరిగా బోర్లు వేసుకుని సేద్యం చేసే ఆర్థిక స్తోమత లేని ఈ రైతులు సాగును వరుణుడి కరుణతోపాటు సేద్యపు నీటి చెరువులనే ఆధారం చేసుకుంటారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో చిన్న, పెద్ద సేద్యపు నీటి చెరువులు 518 వరకు ఉన్నాయి. వీటిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఇప్పటికే 334 చెరువులు కాస్తోకూస్తో అభివృద్ధికి నోచుకోగా మరికొన్నింటి పనులు జరుగుతున్నాయి.

**నిధుల కేటాయింపు ఇలా..**

నియోజకవర్గంలో 53 సేద్యపు నీటి చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.38.29 కోట్ల నిధులతో చేపట్టే అభివృద్ధి పనులలో ఇవి ప్రధానమైనవి. కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో రాజు సప్లై చానల్ (కొత్త కాలువ మళ్లింపు)ను రూ.8.83 కోట్లతో పటిష్టపరచనున్నారు. బురద కాలువ కుడిగట్టు పటిష్టతకు రూ.80.33 లక్షలు ఖర్చు చేస్తారు. ఇదే కాలువపై 22వ కిలోమీటరు వద్ద రూ.1.97 కోట్లతో చెక్‌డ్యాం నిర్మించి, సుమారు రెండు వేల ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందించనున్నారు. శ్రీరంగపట్నంలోని కోటిదిబ్బపై రూ.52.10 లక్షలతో ఎస్ఎల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. 3.65 కిలోమీటరు బురద కాలువ ఆధునీకరణ పనులను రూ.1.33 కోట్లు వ్యయం చేయనున్నారు. సీతానగరం మండలం రఘుదేవపురం వద్ద స్పెషల్ ఎండీ ఛానల్‌ను రూ.1.10 కోట్లతో, పురుషోత్తపట్నం నుంచి కొండేపూడి వరకు చెరుకూరు ఆవ చానల్‌ను రూ.1.40 కోట్లతో పటిష్టపర్చనున్నారు. ఈ పనులు పూర్తయితే ఆ ప్రాంతంలో అధిక వర్షాలకు ఎదురయ్యే ముంపు సమస్య పరిష్కారమవుతుంది.

**మరికొన్ని..**

బుచ్చింపేట – శ్రీరంగపట్నాల మధ్యఉన్న తోట కాలువ ఆధునీకరణకు రూ.1.65 కోట్లు, రాఘవపురంలోని నారాయణ కన్నా సర్‌ప్లస్ ఛానల్‌పై ఐదు చెక్‌డ్యాంలకు రూ. 1.12 కోట్లు, బొల్లెద్దుపాలెంలోని వినుకొండ కాలువపై చెక్‌డ్యాంకు రూ. 40.58 లక్షలు, రాజానగరం మండలం జి.యర్రంపాలెంలో తిమ్మరాజు చెరువుకు రూ.68.40 లక్షలతో మరమ్మతులు చేపట్టనున్నారు. కూనవరం డ్రైన్‌ను రూ.3.88 కోట్లతో ఆధునీకరణ చేయనున్నారు. వీటితోపాటు తొర్రిగడ్డ డ్రైన్, జగన్నాథపురం, గుమ్ములూరుల్లో చెక్‌డ్యాంల ఆధునీకరణ పనులు ప్రారంభం కానున్నాయి.

**తండ్రి బాటలోనే ..**

స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తన తండ్రి జక్కంపూడి రామ్మోహనరావు తరహాలోనే రైతుల బాగుకోసం ఆలోచన చేశారు. రైతన్నలు చేసుకున్న విన్నపాలను పరిగణనలోకి తీసుకుని, ముఖ్యమైనవిగా భావించిన ఆయన ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి చేసే చెరువులతోపాటు మరికొన్ని సేద్యపు నీటి చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశారు. వీటికి అవసరమైన నిధులు మంజూరు చేసి, సాగునీటి సమస్య నివారణకు తోడ్పడాలని సంబంధిత శాఖల ఉన్నతాధికారులను, మంత్రులను కోరుతూ వచ్చారు. ఎట్టకేలకు ఆయన విజ్ఞాపనలు ఫలించి, నియోజకవర్గంలో 53 సేద్యపు నీటి చెరువులను అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ సతీష్ భూషన్‌కుమార్ రూ.38.29 కోట్లు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

**సాగునీటి కొరత ఉండదు**

ఈ నిధులతో నిర్ణయించిన చెరువులను అభివృద్ధి చేయడం ద్వారా రైతాంగానికి సాగునీటి సమస్యను చాలావరకు నివారించగలుగుతాం. అంతే కాక ఈ చెరువులను లోతు చేయడంతోపాటు గట్లను పటిష్టపర్చడం, తూములను, కల్వర్టులు, కళింగలను బాగుచేయడం ద్వారా వర్షాకాలంలో నీరు వృథాగా పోకుండా నిల్వ చేయగలుగుతాం. కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో ఏటా బురద కాలువ పోటెత్తడంతో పలు గ్రామాలు ముంపు బారిన పడుతున్నాయి. చెరువుల అభివృద్ధితో ఆ బెడదను నివారించవచ్చు.

– అదబాల చినబాబు, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం

### సరస్వతీ దేవి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: స్థానిక పాతవూరు సల్లకాలువ వంతెన సమీపంలో ఉన్న సరస్వతీ దేవిని బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామానికి చెందిన చిర్ల వీర్రాఘవరెడ్డి ఆర్థిక సాయంగా అందించిన రూ.3 లక్షల వ్యయంతో ఈ షెడ్డును నిర్మించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నేషనల్ వెంకటరెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచి వారా కుమారి, ఉపసర్పంచి చిర్ల వీర్రాఘవరెడ్డి, గుత్తుల రమణ, చిర్ల వీర్రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పెన్నులకు పూజలు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి స్వామి ఆలయం వద్ద కాకినాడ రామారావుపేటకు చెందిన విశ్రాంత బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి సత్యనారాయణ సమకూర్చిన పెన్నులను స్వామి వారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పెన్నులను పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పంచి పెడతామని ఈవో ఆకెళ్ళ భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయం కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగశ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి



అనపర్తిలో సత్కారం అందుకున్న మహిళా పోస్టల్ సిబ్బంది



గోకవరంలో మహిళా అధికారిని సన్మానిస్తున్న ఎంపీపీ శ్రీవల్లి

అనపర్తి: సమాజంలో మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమని గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు స్వర్ణన్‌రాజు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక సబ్ పోస్టాఫీసు ప్రాంగణంలో మహిళా ఉద్యోగుల సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. అనపర్తి, బిక్కవోలు, ద్వారపూడి పోస్టాఫీసుల్లో పని చేస్తున్న మహిళా సిబ్బందిని దుశ్శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి వై.కామేశ్వరి, పోస్టల్ అసిస్టెంట్ వై.మోహన్, ఎ.కృష్ణశ్రీ, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

**వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళలకు పెద్ద పీట**

గోకవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి అన్నారు. గోకవరం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఎంపీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు పలు పోటీలు నిర్వహించారు. వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందిస్తున్న 40 మంది మహిళా ఉద్యోగులకు సన్మానాలు చేసి, జ్ఞాపికలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీవల్లి, జెడ్పీటీసీ సభ్యుడు దాసరి శ్రీరంగ, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వరసాల కుమారి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

**ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవం**

సీతానగరం: బొబ్బిల్లంక అశోక్ నగర్ ఎంపీపీ స్కూల్లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించి, ఆర్థికంగా అభ్యున్నతి సాధించాలన్నారు.

- ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ వై.మధుసూదనరెడ్డి, కార్యదర్శి జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో సీతానగరం మండల శాఖ డాక్టర్ సత్యం రమేష్‌బాబు, ఎస్.సుధాకర్, డి.రాజు, ప్రసాద్ తదితరులు ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సి.శశికళను సత్కరించారు.
- రఘుదేవపురం గౌతమీ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో ఉపాధ్యాయులు డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ బొంగు రాజారావు, పద్మావతి దంపతులను సన్మానించారు. హెచ్ఎం వి.అరుణ, కె.త్రిమూర్తులు, డి.అరుణ, వి.వంశి, జె.భోగేశ్వరరావు పాల్గొన్నారు.



బొబ్బిల్లంకలో మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోత్స్న

**అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి**

రాజానగరం: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని జేఎన్టీయూకే మహిళ సాధికారిక విభాగాధిపతి స్వరూపారాణి అన్నారు. తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళ దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్‌పర్సన్ అనూషరెడ్డి, ప్రిన్సిపాల్ రాజశ్రీరావు, కన్వీనర్ బాలకుమారి, సింధుజ పాల్గొన్నారు.

# వైద్య సేవల్లో సెవెన్‌స్టార్ భేష్

- కాకినాడ ఎంపీ వంగా గీత



ఉచిత వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత. చిత్రంలో ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: అత్యాధునిక, మెరుగైన వైద్యసేవలను అందించడంలో సెవెన్‌స్టార్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కృషి అభినందనీయమని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సెవెన్ స్టార్ హాస్పటల్‌లో బుధవారం ఎముకల సాంద్రత, కాల్షియం పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఎంపీతో పాటు ఎమ్మెల్యే ద్వారంపూడి, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులు సాంత్వన పొందేలా ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నారని, ఈ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ అత్యాధునిక వైద్య పరికరంతో ఎముకల సాంద్రత పరీక్షను ఈ నెల 20 వరకు ఉచితంగా అందిస్తున్నారని, అలాగే రూ.1500 నుంచి రూ.2000 ఖర్చు అయ్యే కాల్షియం పరీక్షను ఉచితంగా చేయించుకునే వెసులుబాటు కల్పించారని ప్రశంసించారు. సెవెన్‌స్టార్ అధినేత డాక్టర్ సత్తి వెంకటరెడ్డి మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి వచ్చే మహిళలకు ఈ నెల 20వ తేదీ వరకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్ ద్వారంపూడి భాస్కరరెడ్డి, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, శ్రావణి హాస్పటల్ అధినేత డాక్టర్ సత్తి వీర్రెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, రెడ్డి సంక్షేమ సంఘ అధ్యక్షుడు నల్లమిల్లి బుచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్ నల్లబెల్లి సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర జీవనం



కోతకు వచ్చిన పొలంలో పచ్చిరొట్ట విత్తనాలను చల్లిస్తున్న వ్యవసాయాధికారులు

రాజానగరం: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలతోనే మానవ జీవన విధానం ఆరోగ్యంగా ఉంటుందని వ్యవసాయ శాఖ జిల్లా సహాయ సంచాలకులు బోసుబాబు అన్నారు. నరేంద్రపురంలో రైతులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగిస్తూ, తద్వారా చేకూరే ప్రయోజనాలను వివరించారు. తొలకరి పంటకు ముందుగా పచ్చిరొట్ట, పప్పుజాతి, తీగజాతి, ఆకుకూర, కూరగాయల విత్తనాలను ఎకరానికి 13 కిలోల చొప్పున చల్లుకుంటే భూమి సారవంతమవుతుందని డీపీఎంయూ (డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ యూనిట్) జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, డీటీ గౌతమ్ తెలిపారు. ఇంటి పెరటిలో కూరగాయల మొక్కలను, పాదులను కూడా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేయాలన్నారు. అనంతరం క్షేత్ర సందర్శన చేసి, ఎంపిక చేసిన 10 మంది రైతులతో 30 ఎకరాలలో 30 రకాల పచ్చిరొట్ట విత్తనాలను చల్లించారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బందితో పాటు ఎంటీ దుర్గాదేవి, ఎస్‌డీఏ వీరవెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

# భక్తులందరికీ ఆత్మీయ ఆతిథ్యం



కోరుకొండలో నాని ఇంటివద్ద భోజనాలు చేస్తున్న ఉద్యోగులు

మధురపూడి: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలకు వచ్చిన భక్తులకు స్థానికులు ఎంతో చక్కగా ఆతిథ్యమిచ్చారు. ఈనెల 2నుంచి బుధవారం వరకూ ఉత్సవాలు జరిగాయి. వీటికి లక్ష మంది భక్తులు హాజరయ్యారు. స్వామి వారి ఆలయాన్ని దత్తత తీసుకున్న అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో భక్తులకు స్థానిక సేవాసంస్థలు, సంఘాలతో పాటు టీచర్లు వితరణ చేశారు. ఆహారంతో పాటు మజ్జిగ, పాలు అందించారు. దానిలో భాగంగా స్థానిక ఉపాధ్యాయుడు బొడ్డు నాని కుటుంబ సమేతంగా భక్తులకు వితరణ చేశారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో వారం రోజులు పాటు సేవలందించిన ఉద్యోగులకు మంగళవారం స్థానిక శివాలయం సమీపంలోని తన ఇంటిలో భోజనాలు అందజేశారు. చివరి రోజైన బుధవారం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నేతుల చిన్ని, పసుపులేటి బుల్లియ్యనాయుడు పాల్గొన్నారు.

# మహిళపై కేసు

సీతానగరం: వెదుళ్లపల్లికి చెందిన డ్వాక్రా మహిళ బొర్రా సుబ్బలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోలి చంద్రపై కేసు నమోదు చేశామని ఎస్సై కె.శుభశేఖర్ బుధవారం తెలిపారు. వెదుళ్లపల్లిలోని కృపాకిరణ్ మహిళా శక్తి సంఘం కార్యదర్శి గోలి చంద్ర.. సంఘం సభ్యుల నుంచి వాయిదాలు కట్టడానికి రూ 13,500 వసూలు చేసి, రూ.1,800 మాత్రమే బ్యాంక్‌లో కట్టారని, మిగిలిన సొమ్మును బ్యాంక్‌కు చెల్లించలేదని సుబ్బలక్ష్మి ఫిర్యాదు చేశారన్నారు.

**ప్రధానోపాధ్యాయుడికి గాయాలు**

చినకొండేపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు అద్దెపల్లి సత్యనారాయణ ఈనెల 4న రాజమహేంద్రవరం బైక్‌పై ఎదురుగా వచ్చిన మరో మోటారు సైకిల్ ఢీకొంది. ఈ ఘటనలో ఆయన గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రి సమాచారంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ లోవ కుమార్ తెలిపారు

# బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే రాజా పరామర్శ



నాగంపల్లి ఎంపీటీసీ లక్ష్మిని ఓదార్చుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: నాగంపల్లి ఎంపీటీసీ బిడిసే లక్ష్మి భర్త గంగాధర్ బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఎంపీటీసీ లక్ష్మిని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించారు. గంగాధర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వంగలపూడిలో చవ్విడి చిట్టియ్య, కాజా చంటబ్బాయి, చిక్కాల సూరిబాబు, పట్నాల రమణమ్మ, తాడివలస అప్పారావు, సిగిరిపల్లి ఏసు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించారు. రామచంద్రపురంలో ఇటీవల మృతి చెందిన చంటమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, నియోజకవర్గం బూత్ కమిటీల చైర్మన్, పార్టీ చేరికల కమిటీ కన్వీనర్ గద్దె వెంకటకృష్ణ చౌదరి (నల్లి), చల్లమళ్ల సుజీరాజు, మన్నెలి వెంకట్రావు ఉన్నారు.

# అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న తాటాకిల్లు



బాధిత కుటుంబానికి నగదు, బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: పెదపూడిలో మంగళవారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమై రెండు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వీఆర్వో చండి తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో వల్లూరి వెంకటరమణ, అతని కుమారుడు దుర్గాప్రసాద్‌ల కుటుంబాలు ఒకే తాటాకింట్లో నివాసముంటున్నారు. మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించడంతో వారంతా కట్టుబట్టలతో ఇంట్లోంచి బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న కాకినాడ అగ్నిమాపక సిబ్బంది హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే తాటాకిల్లు పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేస్తున్నారు. తహసీల్దార్ టి.సుభాష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి బియ్యం అందజేశారు.

**బాధితులకు రూ.20 వేల ఆర్థిక సాయం**

పెదపూడి: అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బుధవారం పరామర్శించారు. బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు సమకూర్చిన రూ.20 వేల నగదు, 50 కేజీల బియ్యంతో పాటు ప్రభుత్వపరంగా మరో 50 కేజీల బియ్యాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, బీసీ సెల్ మండల కన్వీనర్ పప్పు సింహాచలం, కోసూరి వాసు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో మౌలిక వసతులపై దృష్టి



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎంపీపీ శ్రీవల్లి, జెడ్పీటీసీ సభ్యులు శ్రీరంగ తదితరులు

గోకవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతులపై దృష్టి సారించిందని గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ సభ్యులు దాసరి శ్రీరంగ అన్నారు. గోకవరంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుటి వీధిలో సుమారు రూ.10 లక్షల మండల పరిషత్, పంచాయతీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వరసాల కుమారి, గ్రామ సర్పంచ్ కొమరం శ్రావణి, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు తోలేటి రమ్యశ్రీ, నరాలశెట్టి గౌతమి, ఉనుకూరి అసిరమ్మ, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, సుంకర వీరబాబు, నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్ పాల్గొన్నారు.